క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

గంభీరావుపేట: తాళం వేసిన ఇంట్లో చొరబడిన దుండగులు నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడి వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని గజసింగారం గ్రామానికి చెందిన బాల్‌నర్స్ శ్రీకాంత్ తన తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆస్పత్రిలో చేర్పించాడు. ఎక్కువ సమయం అక్కడే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికి రాగా.. తాళం పగుల గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. తల్లి వైద్యం కోసం అప్పు తెచ్చిన రూ.60 వేలు, 2 తులాల బంగారు ఆభరణాలు, నాలుగు వెండి గొలుసులు చోరీకి గురయ్యాయని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. తన పాత ఇంట్లోనూ చొరబడి, బీరువా పగుల గొట్టారని, ఎలాంటి సామగ్రి పోలేదని ఇదే గ్రామానికి చెందిన బాలయ్య తెలిపాడు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

వేములవాడ అర్బన్: కూలీ పని చేస్తూ ఓ వలస జీవి ప్రమాదవశాత్తు మృతిచెందగా.. నెల రోజుల తర్వాత మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌కు చెందిన గుడిసె మల్లేశ్(46) జీవనోపాధి నిమిత్తం 18 నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. గత డిసెంబర్ 24న కూలీ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఇసుక దిబ్బలు పడి, మృతిచెందాడు. అతని మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. మృతుడికి భార్య పరిమళ, కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మల్లేశ్‌ది నిరుపేద కుటుంబమని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఆర్‌ఐ సంతోష్‌పై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: దుమాలకు చెందిన దళితరైతును భయభ్రాంతులకు గురిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్‌ఐ) సంతోష్‌పై బాధితుడు శుక్రవారం కలెక్టర్, డీపీఆర్వో, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు రామిండ్ల కుమార్ తెలిపిన వివరాలు. దుమాలలో నూతనంగా నిర్మాణంలో ఉన్న రోడ్డు విషయంలో తమకు సంబంధం లేకుండా ఒక వైపు తవ్వుతుండడంతో నష్టం జరుగుతుందని పనులు అడ్డుకున్నట్లు తెలిపారు. రోడ్డు విషయం ఆర్‌అండ్‌బీ అధికారులు చూసుకుంటారని చెప్పినా వినకుండా తమ కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశాడని ఆరోపించారు. రైతులకు నష్టం జరుగుతున్నా పట్టించుకోకుండా చిందులేశాడన్నారు. సదరు ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరాడు. లేని పక్షంలో కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డులో శుక్రవారం ద్విచక్ర వాహనదారుడు పందులను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. ప్రకాశ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో పందులు అడ్డుగా వచ్చాయి. వాటిని తప్పించే ప్రయత్నంలో వాహనం నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశ్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ..

ముస్తాబాద్: ముస్తాబాద్ రాజీవ్ చౌరస్తా వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోతుగల్‌కు చెందిన మాల మహానాడు మండల అధ్యక్షుడు జంగ భూమరాజం ద్విచక్ర వాహనంపై శుక్రవారం ముస్తాబాద్ నుంచి పోతుగల్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలో నిజామాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు రాజీవ్ చౌరస్తా వద్ద ఢీకొట్టింది. భూమరాజం తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట: మండల కేంద్రానికి చెందిన ఎగోలపు మల్లేశంగౌడ్ శుక్రవారం ఉదయం ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ ప్రమాదంలో మల్లేశం కాలు విరిగి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు.

తల్లీకూతుళ్లు అదృశ్యం

ఎల్లారెడ్డిపేట: అక్కపల్లికి చెందిన బిట్ల మల్లేశం భార్య ప్రవంతి, తన ఐదేళ్ల కూతురు శ్రీమోక్ష జనవరి 28న తన తల్లిగారింటికి బయలుదేరింది. అయితే వాళ్ల ఇంటికి వెళ్లలేదని తెలిసి.. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఎల్లారెడ్డిపేట పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసుగా నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

వేములవాడరూరల్: నమిలిగుండుపల్లి గ్రామంలో సీసీ రోడ్డుకు రూ.80లక్షల నిధులు మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వంగపల్లి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు వకుళాభరణం శ్రీనివాస్, రంగు వెంకటేశ్, సోయినేని కరుణాకర్, చిలుక ప్రభాకర్, బొడ్డు రాములు, సంగ స్వామి, బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిరిసిల్లకల్చరల్: దీపాలంకరణ

వాసవీ మాతకు పూజలు

సిరిసిల్లకల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని వైశ్య భవనంలోని అమ్మవారికి ఉదయం అభిషేకాలు, హోమం నిర్వహించారు. శ్రీలలితా పారాయణంతోపాటు కుంకుమ పూజ, సాయంత్రం దీపాలంకరణతో అర్చించారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని శ్రీశివాలయంలో వాసవీ మాత ఉత్సవ విగ్రహానికి కుంభమేళా త్రివేణి సంగమం నుంచి తెచ్చిన జలాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.



రోడ్డుపై కవర్లు..

వేములవాడఅర్బన్: వేములవాడ నందికమాన్ వద్ద సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిపై గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లను భద్రపరిచే లిపాప్ కవర్ల కట్టలు రోడ్డుపై పడి ఉన్నాయి. రానున్నది గ్రామ పంచాయతీ ఎన్నికలు కావడంతో ఈ ఎన్వోలప్ లిపాప్ కవర్లు ఎక్కడివనేది ఎవరికి అంతుచిక్కడం లేదు. ఈ కవర్లు వాహనంలో తరలిస్తే పడిపోయాయా.. ఎవరైనా పడేశారా అనేది తెలియరాలేదు.

రోడ్ల పరిస్థితి అధ్వానం



ఇల్లంతకుంట నుంచి సిద్దిపేట వెళ్లే రోడ్డు



ఇల్లంతకుంట నుంచి జిల్లెల్ల వెళ్లే రోడ్డు

ఇల్లంతకుంట: మండలంలోని రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. ఇల్లంతకుంట నుంచి సిద్దిపేటకు వెళ్లే రోడ్డు కిష్టాపూర్ వరకు సరిగా లేక వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇల్లంతకుంట నుంచి వెంకట్రావుపల్లి వరకు రోడ్డు మరమ్మతు చేపట్టక బీటీ రోడ్డంతా పోయి మట్టి రోడ్డు తేలి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోక అధ్వానంగా తయారయింది. ఫోర్‌వేగా మార్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేటకు వచ్చిన సమయంలో ప్రకటించారు. కానీ ఇప్పటివరకు పనులు అమలుకు నోచుకోక మండల ప్రజలు నిరాశకు గురవుతున్నారు. ఇల్లంతకుంట నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు ఇల్లంతకుంట నుంచి వెల్జిపురం వరకు అడుగడుగునా గుంతలమయంగా ఉంది. బీటీ రోడ్డు కనబడకుండా పోయింది. రహీంఖాన్‌పేట నుంచి వెల్జిపురం వరకు వెళ్లాలంటే వాహనదారులకు చుక్కలు కనబడుతున్నాయి. అనంతారం నుంచి రహీంఖాన్‌పేట వరకున్న రోడ్డు దారుణంగా తయారైంది. ఇల్లంతకుంట నుంచి జిల్లెల్ల వరకున్న సింగిల్ రోడ్డు సంవత్సర క్రితమే సెకండ్ లేయర్ బీటీ పోసినా.. సైడ్ బర్మ్‌లు అధ్వానంగా తయారై వాహనదారులు రోడ్డు కిందికి దిగి మళ్లీ పైకి రావాలంటే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లే. మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు ప్రభుత్వం, అధికారులను కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



అధ్వాన పరిస్థితిలో ఉన్న రోడ్లన్నింటికీ మరమ్మతు చేసి ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడాలి. ఇల్లంతకుంట నుంచి కిష్టాపూర్ వరకు, ఇల్లంతకుంట నుంచి వెల్జిపురం వరకు రోడ్డు మరమ్మతు వెంటనే చేపట్టాలి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

– భూమల్ల అనిల్‌కుమార్, కందికట్కూర్

సర్వేయర్ సేవలు మరువలేనివి

సిరిసిల్ల: జిల్లాలో భూమి కొలతల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పని చేసిన గౌరిశెట్టి బాలచంద్రం సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం బాలచంద్రం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలచంద్రం సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ శాఖలో సుమారు 32 ఏళ్లు సేవలందించారన్నారు. ఆయన సేవలను కలెక్టర్ అభినందించారు. బాలచంద్రం దంపతులను శాలువా, పూలగుచ్ఛంతో సన్మానించారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాధాభాయి, రాజేశ్వర్, జిల్లా పశు వైద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలచంద్రం దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సేవలు స్ఫూర్తిదాయకం

సిరిసిల్లక్రైం/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పని చేసి విరమణ పొందిన ఉద్యోగుల సేవలు సహోద్యోగులకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిచిన కళాధర్, కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐగా ప్రస్తుతం ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన కిషన్‌రావు, కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావు శుక్రవారం విరమణ పొందారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు.



సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కార్యకర్తల బలం ఎన్నికల్లో చూపించాలి

వేములవాడఅర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల బలం చూపించి గెలవడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ అర్బన్ మండల బీఆర్‌ఎస్ కార్యకర్తలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గడిచిన ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అబద్ధాలు చెప్పి మరింత బలహీనపడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తారని అన్నారు. సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవి, బూర బాబు, ఆర్ సీరావు, మాజీ సర్పంచులు రేగులపాటి రాణి, స్వయంప్రభ, వెంకటరమణారావు, రాసూరి రాజేశం, సందీప్‌రెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

గద్దర్‌కు నివాళి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో గద్దర్ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పాత బస్టాండ్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడారు. సద్ది లక్ష్మారెడ్డి, ఎస్‌కే గౌస్, రొడ్డ రామచంద్రం, రాంరెడ్డి, లింగంగౌడ్, బండారి బాల్‌రెడ్డి, రాజేందర్, బాబు, నారాయణరెడ్డి, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: అంబేడ్కర్ చౌరస్తాలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాకం రాజేశ్, యాద ఈశ్వర్, యాద రామస్వామి, ఈడుగు స్వామి, ఈడుగు అంజయ్య, నీరటి ప్రదీప్, మండల నరేశ్, దాసరి బాబు, మందాల వంశీ, అనిల్, మహేందర్, రాజశేఖర్ తదితరులున్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలోని నృత్య కళానికేతన్ సేవాసంస్థ కార్యాలయంలో నిర్వహించారు. కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి మాట్లాడారు. బొడ్డు రాములు, వారాల దేవయ్య, రాజేశం, రవిగౌడ్, రాజు, రమేశ్ తదితరులున్నారు.



ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట: సైబర్ నేరాలతో యువకులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ మొగిలి అన్నారు. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు పత్తికుంటపల్లె గ్రామంలో మీకోసం పోలీసులు కార్యక్రమం నిర్వహించారు. ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పరం గౌరవించుకోవాలి

వేములవాడ: ప్రజాస్వామ్య దేశంలో అంబేడ్కర్ అందించిన రాజ్యాంగం విలువలను కాపాడుతూ పరస్పరం మనోభావాలను గౌరవించుకుంటూ సమాజాభివృద్ధికి పాటుపడాలని ముస్లిం పట్టణ కమిటీ అధ్యక్షుడు అక్రమ్ పాషా అన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

రుద్రంగి: ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీటీ యాదగిరి అన్నారు. శుక్రవారం మండల, గ్రామ శాఖల అధికారులు, గ్రామ ప్రజలతో కలిసి బడితండా గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంటరానితనం, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు.

దోమల బెడద నివారించాలి

కోనరావుపేట: కనగర్తిలో దోమల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని వంగపెల్లి భూపతి, గ్రామస్తులు ఎంపీవోను కోరారు.

సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని గొల్లపల్లె ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయుడు ముత్యాల ప్రభాకర్ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గొల్లపల్లె పాఠశాలలో 12 సంవత్సరాలుగా పని చేసి విద్యార్థులకు విద్య అందించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయుల సంఘం నాయకులు పార్వతీ తిరుపతి, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులున్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ వద్దు

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు శుక్రవారం పలు సూచనలు చేశారు. వేములవాడ టౌన్ ట్రాఫిక్ ఎస్సై రాజు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. డిపో ఉత్తమ డ్రైవర్లు రవీందర్‌రెడ్డి, బాబురావు, రవీందర్‌లను సన్మానించారు. డిపో మేనేజర్ శ్రీనివాస్, రామచంద్రం, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కోనరావుపేట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కీసరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వీరబోయిన తిరుపతిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వంగల భూమేశ్‌గౌడ్, కార్యదర్శిగా బోయిన శ్రీనివాస్‌ను నియమించారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా రాజు

తంగళ్లపల్లి: భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా ఇటికల రాజును శుక్రవారం మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు నియమించారు. నియామక పత్రాన్ని అందజేశారు. బీజేవైఎం యువ మోర్చా అధ్యక్షుడిగా కోసిని వినయ్‌యాదవ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కన్నా అరుణ్‌కుమార్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నాగుల శ్రీనివాస్‌ను నియమించినట్లు తెలిపారు.

సీఎంకు ఆహ్వానం



సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఫిబ్రవరి 13న జరిగే తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసంలో అందించి వివాహానికి ఆహ్వానించారు.

మంత్రి పొన్నంను కలిసిన విజయ్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేట: కోరుట్లపేట గ్రామానికి చెందిన రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలోని పలు సమస్యలను మంత్రికి వివరించారు.



ముస్తాబాద్: ముస్తాబాద్‌లో మద్దికుంట దారిలో మురుగు కాల్వ అస్తవ్యస్తంగా మారింది. 20 ఏళ్ల క్రితం ప్రధాన రహదారి పక్కన నిర్మించిన మురుగు కాల్వ శిథిలమైంది. ఈగలు, దోమలతో ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులంటున్నారు. దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. ఇక్కడ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి కొత్తగా మురుగు కాల్వ నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రమేశ్, పంచాయతీ కార్యదర్శి, ముస్తాబాద్, సెల్ నంబర్: 9866964956

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఏఈఈ ఆత్మహత్యకు బాధ్యులైన వారిని శిక్షించాలి

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండల మిషన్ భగీరథ ఏఈఈ సాయిచరణ్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిని గుర్తించి శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల(ఏఈఈ) సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి కోరారు. సిరిసిల్ల–వేములవాడ పట్టణాల మధ్య అగ్రహారం మిషన్ భగీరథ(ఇంట్రా) కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఈఈలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సాయిచరణ్ ఉద్యోగంలో చేరి ఆరు నెలలు గడవకముందే ఆత్మహత్య చేసుకోవటం చాలా బాధాకరమన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను వెలికితీసేందుకు విచారణ కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఏఈఈల అసోసియేషన్ కార్యదర్శి బొల్గం సాగర్, కోశాధికారి విశ్వాన్, జిల్లాలో పనిచేస్తున్న అన్ని ఇంజినీరింగ్ విభాగాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అధికారులు పాల్గొన్నారు.



అగ్రహారం మిషన్ భగీరథ ప్లాంటు వద్ద ఇంజినీర్ల నిరసన

కుష్ఠు వ్యాధిపై అవగాహన

కోనరావుపేట: కుష్ఠు వ్యాధి వారోత్సవాల్లో భాగంగా కోనరావుపేట ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లకు కుష్ఠు వ్యాధి వ్యాప్తిపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పర్శ లేని మచ్చలు, రాగి వర్ణంలో ఉంటే వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వేణుమాధవ్, డీపీఎంవో దేవ్‌సింగ్, సీహెచ్‌వో కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ రషీద్, ఏఎన్‌ఎం సరిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరెళ్ల పీహెచ్‌సీ సందర్శన

తంగళ్లపల్లి: నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ అధికారిణి యేంజిలా ఆల్ఫ్రెడ్ సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులను పరిశీలించారు. గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఇ.చంద్రికారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారిణి యేంజిలా

రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

బోయినపల్లి: అసంక్రమిత వ్యాధుల విషయంలో ప్రతి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా.రామకృష్ణ అన్నారు. కొదురుపాక ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. అసంక్రమిత వ్యాధులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధుల స్క్రీనింగ్, అనుమానిత, రెఫరల్, ఫాలోఅప్ రికార్డులను పరిశీలించి ప్రతి రోగి వివరాలు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఉప కేంద్రానికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కొదురుపాక పీహెచ్‌సీ వైద్యాధికారి రేణుప్రియాంక, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం లక్ష్మమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.



కొదురుపాక పీహెచ్‌సీ ఉప కేంద్రంలో రామకృష్ణ

నేడు మార్కండేయస్వామి జయంతి

సిరిసిల్లకల్చరల్: మార్కండేయస్వామి జయంతి ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. శనివారం ఉదయం 9.45 గంటలకు మార్కండేయ మహాయాగం, పూర్ణాహుతితో ప్రారంభమై, సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని పురవీధుల గుండా స్వామివారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని శ్రీశివభక్త మార్కండేయ ఆలయంలో శనివారం త్రింశతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంచికట్ల రమేశ్, పద్మశాలీ మండల సంఘం అధ్యక్షుడు చొటపెల్లి వెంకటేశం తెలిపారు. ఆలయ 30వ వార్షికోత్సవం సందర్భంగా త్రింశతి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం అఖండ దీపారాధన, నవగ్రహ స్థాపనం, అభిషేకం, మధ్యాహ్నం దంపతుల హోమం, పూర్ణాహుతి, మహా హారతి కార్యక్రమాల అనంతరం అన్నదానం చేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మార్గం సత్తయ్య, మార్గం హరిబాబు, అడ్డగట్ల శేఖర్, మంచికట్ల విశ్వనాథం, నిత్యానందం శంకర్, దేవదాస్, సంజీవ్, శేఖర్, మహేశ్, కిరణ్, చక్రపాణి, సురేశ్, రాజు తదితరులున్నారు.

దేవాలయ నిర్మాణానికి స్థలం దానం

చందుర్తి: మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన మోతె బాబు అనే ఎన్నారై దానం చేశారు. సుమారు రూ.25లక్షల స్థలాన్ని గ్రామ పెద్దలకు శుక్రవారం అందజేశారు. గ్రామంలోని పోచమ్మ దేవాలయం సమీపంలోనే శివాలయం నిర్మాణం చేపట్టేందుకు కావాల్సిన స్థలం దస్తావేజులను అందజేశారు. బాబును గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి చెందిన ఎన్నారై అవిరినేని శ్రీనివాస్‌రావు ఆలయ నిర్మాణానికి రూ.1.50లక్షలు అందజేశారు.

చెక్కులు అందజేత

ఇల్లంతకుంట: పెద్దలింగాపురం గ్రామంలో శుక్రవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల పాలిట సీఎంఆర్‌ఎఫ్ వరమన్నారు.

వీర్నపల్లి: గర్జనపల్లి, జవహర్‌లాల్‌నాయక్‌తండా గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డైరెక్టర్ సంతోష్‌నాయక్, రాకేశ్‌గౌడ్ అందజేశారు. న్యాత లావణ్యకు రూ.60వేలు, భూక్య కమలకు రూ.20వేల చెక్కులను అందజేశామన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

ఇల్లంతకుంట: మండల వనరుల కేంద్రంలో శుక్రవారం మండలస్థాయిలో ఫిజికల్ సైన్స్ టాలెంట్ పరీక్ష ఫిజికల్ సైన్స్ ఫోరం ఉపాధ్యాయులు నిర్వహించారు. పోటీ పరీక్షలో కేజీబీవీ గురుకుల ఆదర్శ, జిల్లాపరిషత్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.